www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 26 జులై 2025




## ఎర్రచందనం కేసుల ప్రత్యేక కోర్టు పిపిగా నారాయణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల విచారణకు తిరుపతి ప్రత్యేక న్యాయస్థానానికి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మదనపల్లెకు చెందిన సీనియర్ న్యాయవాది అలుగూరి అమర నారాయణను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని బి.కొత్తకోట మండలంలోని గట్టు గ్రామానికి చెందిన అమర నారాయణ 30 ఏళ్లుగా మదనపల్లె కోర్టులో న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. తన న్యాయవృత్తిలో ఎంతో ప్రత్యేకతను ప్రదర్శించి అనేక కేసుల పరిష్కారంలో ముఖ్యపాత్ర వహించారు. అమర నారాయణ ప్రస్తుతం జనసేన లీగల్ సెల్ చిత్తూరు జిల్లా చైర్మన్‌గా కొనసాగుతున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు లీగల్ అడ్వైజర్‌గా కూడా పనిచేస్తున్నారు. తన సమర్థత, నిజాయితీ, న్యాయ విధానాల పట్ల ఉన్న అంకితభావం ఆయనకు ఈ పదవిని తెచ్చిపెట్టినట్లు న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సందర్భంగా అమర నారాయణ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, అడిషనల్ అడ్వొకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

# పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

### - కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-ములకలచెరువు

పిజిఆర్ఎస్ వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం పిజిఆర్ఎస్ వేదిక ద్వారా మండలంలోని వేపూరికోట గ్రామానికి సంబంధించిన అర్జీపై ఆ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆ సమస్యను కలెక్టర్ పరిష్కరించారు. వేపూరికోట గ్రామానికి చెందిన రత్నమ్మ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందించిన అర్జీని పరిష్కరించేందుకు ఆ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆయన రత్నమ్మ అందజేసిన అర్జీపై తహశీల్దార్, ప్రజలను వివరాలు అడిగి అర్జీలో పేర్కొన్న రహదారి, ఆర్అండ్‌బి శాఖకు చెందినదిగా తేల్చి సమ స్యను పరిష్కరించారు. అనంతరం ఆర్అండ్‌బి బోర్డులను ఏర్పాటు చేయవల సిందిగా తహశీల్దారును ఆదేశించారు. ఈ తనిఖీలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, తహశీల్దార్ ప్రదీప్‌కుమార్, ఎంపిడిఒ హరినారాయణ పాల్గొన్నారు.

**వంద శాతం చెత్త సేకరణ జరగాలి :** గ్రామ పంచాయతీ పరిధిలో వంద శాతం చెత్త సేకరణ జరగాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వేపూరికోటలోని వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రంలోకి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి తీసుకురావాలని తెలిపారు. గ్రామ పంచాయతీలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరగాలని పంచాయతీ సెక్రటరీని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరిగేందుకు అవసరమయ్యే గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఖాళీలు ఉంటే వాటిని వెంటనే భర్తీ చేసుకోవాలని సూచించారు. వంద శాతం చెత్త సేకరణ జరగాలని ఎంపిడిఒ హరినారాయణ, పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు.



భూ సమస్యపై గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

# చలో విద్యుత్ సౌధను జయప్రదం చేయండి

### - సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ందరినీ రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి అరియర్స్‌ను వెంటనే కార్మికులకు ఇవ్వాలి ఆగస్టు 7న చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం డివిజనల్ విద్యుత్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికులతో కలిసి విద్యుత్ సౌధ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం రూ.కోటి ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలని పేర్కొన్నారు. 20, 25 ఏళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు అందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్‌సి అరియర్స్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని కోరారు. కొత్త ఆపరేటర్లందరికీ పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అంద రినీ స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని తెలిపారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్ వినియోగించాలని, కార్మికులు అనారోగ్యం పాలైన యాక్సిడెంట్ గురైన ఉచితంగా అన్లిమిటెడ్ హెల్త్ కార్డులను కార్మికులకు ఇవ్వాలని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కానందున ఆగస్టు 7వ తేదీన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్ సిఐటియు ఆధ్వర్యంలో చలో విద్యుత్ సౌధా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్మికులు నిరసనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యుఇఇయు) డివిజన్ కార్యదర్శి శ్రీహరి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాజంపేట డివిజన్ కార్యదర్శి పి.బాలకృష్ణ, అధ్యక్షులు డి.సుధాకర్, విద్యుత్తు కార్మికులు సుబ్రహ్మణ్యం, శివ, మధు, రమేష్, నాయుడు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు, యుఇఇయు నాయకులు

# గుండెపోటుతో ఆర్‌టిసి డ్రైవర్ మృతి

- తృటిలో తప్పిన పెనుప్రమాదం
- బస్సులో ముగ్గురే ప్రయాణికులు



ప్రమాదానికి గురైన కావలి ఆర్‌టిసి డిపో బస్సు(ఇన్‌సెట్‌లో) మొహమ్మద్ రసూల్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బస్సు నడుపుతూ ఆర్‌టిసి డ్రైవర్ షేక్ మొహమ్మద్ రసూల్(55) గుండెపోటుతో మృతి చెందారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా కావలి ఆర్‌టిసి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు కావలి నుంచి బుధవారం రాత్రి 7.30 గంటలకు బెంగళూరుకు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున మార్గమధ్యంలోని రాయచోటి పట్టణం మదనపల్లి రోడ్డులోకి రాగానే బస్సు నడుపుతూ విధి నిర్వహణలో ఉన్న బస్సు డ్రైవర్‌కు ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి ఉంచిన బైక్‌ను ఢీకొట్టి అక్కడే నిలిచిపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు అప్రమత్తమై స్టీరింగ్‌పై కుప్పకూలి ఉన్న బస్సు డ్రైవర్ షేక్ మొహమ్మద్ రసూల్‌ను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అప్పటికే డ్రైవర్ రసూల్ మృతి చెందారు. ప్రమాద ఘటన గురించి ప్రయాణికులు పోలీసులకు, ఆర్‌టిసి అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న వారు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బస్సుకు పెను ప్రమాదం తప్పడంతో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలతో సురక్షితంగా బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. షేక్ మొహమ్మద్ రసూల్ మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి కుమారులు రఫీ, షఫిలకు అప్పగించారు. కావలి పట్టణానికి చెందిన మృతుడు షేక్ మొహమ్మద్ రసూల్‌కు భార్య, ఇద్దరు కుమారులు పిల్లలు ఉన్నారు.



మృతి చెందిన రసూల్ (ఫైల్)

# న్యాయవాదులకు రక్షణ చట్టం అవసరం




కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-రాయచోటి

న్యాయవ్యవస్థ మరింతగా పటిష్టంగా పనిచేయడానికి మూల స్తంభాలైన న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని చేయాలని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లాల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాయచోటి కోర్టు మెయిన్ గేటు వద్ద న్యాయవాదులు ధర్నా చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, ఈ పార్లమెంటు సమావేశాలలోనే బిల్లు పెట్టి దేశవ్యాప్తంగా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. కక్షిదారుల పక్షాన కేసును బలంగా వాదించినప్పుడు ప్రతివాదులుగా ఉన్నవారు న్యాయవాదులపై కక్ష పెంచుకొని వివిధ రూపాలలో దాడులకు తెగబడుతున్నారని దీనిని నివారించడానికి ప్రత్యేక చట్టం అవసరమన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కోర్టులలో మహిళా న్యాయవాదులకు ప్రత్యేక విశ్రాంతి గదులను నిర్మించాలని, న్యాయవాదుల అందరికీ ఇళ్ల పట్టాల మంజూరు చేయాలని, కోర్టులలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయమూర్తుల ఖాళీలను ప్రభుత్వ న్యాయవాదుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ప్రమాదవశాత్తు న్యాయవాదులు చనిపోతే ప్రభుత్వం బార్ కౌన్సిల్ కలిపి ఇప్పటివరకు ఇస్తున్న రూ.పది లక్షలను రూ.20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. న్యాయం వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్రంలోని కోర్టులు అన్నిటికీ కూడా మౌలిక వసతులు అన్ని కల్పించాలని చట్టబద్ధ పాలన అమలు కావడానికి ప్రభుత్వం ఈ సమస్యలన్నిటినిపై దృష్టి పెట్టి ఎప్పటినుంచో అ పరిష్కృతంగా ఉన్న ఈ సమస్యలన్నింటిపైన ప్రభుత్వం తగిన విధంగా పరిష్కరించాలని ఐఎఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఎల్ ఉమ్మడి జిల్లా నాయకులు నాయకులు రాజగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, నాగభూషణం, యు.ధనుంజయ్ కుమార్, సీనియర్ న్యాయవాది రాజకుమార్ రాజు, సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా, బార్ స్పోర్ట్స్ సెక్రటరీ సిద్దయ్య, ఎం.చిన్నయ్య, హుమాయూన్ బాషా, కె.నాగేశ్వర, ఎం.నాగేశ్వరరావు, న్యాయవాది బేగ్, శివ కుమార్, కె.వరలక్ష్మి పి.నిరంజన్, ఎంఎన్.జగదీష్, ఇర్షాద్, హరీష్, సయ్యద్ బాషా, భరత్‌రెడ్డి, పవనీష్‌రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

# మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

### - టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మౌలిక సదుపాయల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శేషమాంబపురం గ్రామ పంచాయతీ పాపరాజుగారిపల్లెలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలమైన సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు, పలు అభివృద్ధి కార్యక్రమాలను వారికి తెలియజేస్తూ పింఛన్లు, గ్యాస్, తల్లికి వందనం రేషన్ కార్డులు, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రైతు భరోసా, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వారికి వివరించారు. 2047 కల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలబడే విధంగా ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్నారని తెలియజేశారు. పాపరాజుగారిపల్లి గ్రామస్తులు తాగునీరు, రోడ్ల పలు సమస్యలను చమర్తి దృష్టికి తీసుకురాగా ఆయన వారి సమస్యను సానుకూలంగా విని వెంటనే అధికారులకు ఫోన్ చేసి వారి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, సుబ్బరాజు, సూర్యనారాయణ రాజు, సురేష్ రాజు, భీమరాజు, మధుసూదన్ రాజు, పసుపులేటి శేఖర్, దొరబాబు, రవీంద్ర రాజు, వెంకటరామరాజు, రజని, మణి రాజు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'కళాకారులకు అందాల్సిన పాత బకాయిలు చెల్లించాలి'

ప్రజాశక్తి-పీలేరు

కళాకారులకు అందాల్సిన పాత బకాయిలు చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు ధన్యాసి పెంచలయ్యను కళాకారులు కోరారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల కళాబృందాల నాయకులు, సమన్వయకర్తలు శుక్రవారం విజయవాడ ఘంటసాల ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణంలోని సాంస్కృతిక శాఖ కార్యాలయంలో వారు సహాయ సంచాలకుని కలసి తమ సమస్యలను నివేదించుకున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ద్వారా నిర్వహించిన జన్మభూమి-మన ఊరు, గ్రామదర్శిని కార్యక్రమాల్లో కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి అందాల్సిన బకాయిలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసుకున్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన ఆరు జిల్లాల కళాకారులకు బకాయిలు చెల్లించారని, మిగిలిన జిల్లాలతో పాటు చిత్తూరు, అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాల కళాకారులకు కూడా రావలసిన బకాయిలు చెల్లించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో కళలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఎంతో మంది కళాకారులు గత ఏడు ఏళ్లుగా ఉపాధి కోల్పోయి ఎన్నో రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాకారులకు కళా ప్రదర్శనలు కల్పిస్తూ వారిని ప్రోత్సహించాలని కోరారు. అందుకు స్పందించిన సహాయ సంచాలకులు వీలైనంత త్వరగా బకాయయి సొమ్ము అందేటట్లు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల సమన్వయకర్తలు ప్రవీణ్, తరిమిళ్ల రాజు, టింగ్ టింగ్ వెంకటేష్, కళాబృందాల నాయకులు ఖాదర్ బాష షేక్, కలకట రెడ్డెప్ప, ఎ.ఆదినారాయణ, ఇతర కళాబృందాల నాయకులు పాల్గొన్నారు.

# బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను ప్రతి ఒక్కరూ దత్తత తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. పి4 కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ పది, జెసి ఆదర్శరాజేంద్రన్ పది బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఆ బంగారు కుటుంబాలకు మార్గదర్శిలవ్వాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం అమరావతి నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, ఇతర ప్రజాప్ర తినిధులతో పి4 కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం ఉండకుండా చేసేందుకు పబ్లిక్, ప్రయివేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పి4) కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లుగా పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమం భారతదేశానికే కాకుండా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా అయామ్ మార్గదర్శి అనే ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పి4 కార్యక్రమంలో సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగునున్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి పాటుపడనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శకులను బంగారు కుటుంబాలతో లింక్ చేసి బంగారు కుటుంబాలకు మార్గదర్శి చేయూత ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడేలా చేయాలన్నారు. ఆర్థిక సహాయం చేయలేని వారు మాట సాయం లేదా చదువు చెప్పించడం లేదా అవకాశాలను చూపించడం ద్వారా బంగారు కుటుంబాలకు చేయూతనివ్వచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని జిల్లా అధికారులందరూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని సిపిఒకు సూచించారు. సమావేశంలో జెసి ఆదర్శ రాజేంద్రన్ డిఆర్ఒ మధుసూదనరావు, సిపిఒ వెంకట్, డొనేట్ కార్ట్ సిఇఒ అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



విసిలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ రాజేంద్రన్

## బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

బొప్పాయి రైతులకు కనీసం రూ.25 గిట్టుబాటు ధర కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కన్వీనర్ సి.సుభాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యాపారస్తులు, మధ్య దళారులు ప్రారంభంలో రూ.16 పెట్టి సిండికేట్‌గా ఏర్పడి రోజు రోజుకి ధర తగ్గించుకుంటూ రూ.13లకు చేశారన్నారు. రైతులు ఏడాది పంటకి పెట్టిన పెట్టుబడి రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కోసం, చిట్వేల్, కోడూరులో బొప్పాయి రైతులు, చేస్తున్న ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు విత్తనాలకే, లక్షల్లో ఖర్చు చేస్తున్నారన్నారు. దుక్కులు, కూలీలు, ఎరువులు, రవాణా, ఏడాది పాటు, మధ్య దళారులు దగ్గర, వడ్డీకి తేవడం, వారికే సరుకు ఇవ్వాలని కండిషనర్‌తో సిండికేట్‌గా ఏర్పడి, ధర తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. అనంతపురం, పీలేరులో రూ.30 ధర పలుకుతుంటే రైల్వేకోడూరులో మాత్రం, అతి ఘోరంగా, రూ.13లకు, దళారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. సూటు పేరుతో టన్నుకి 100 కిలోలు తీసివేయాలన్నారు. విపరీతమైన దోపిడీ కారణంగా రైతులు మోసపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చూసుకుని మేలు రకం ఢిల్లీ కటింగ్ కనీసం రూ.25 ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో గురువారం నుండి రైతులు స్వచ్ఛందంగా కోతలు నిలిపివేసి సమ్మె చేస్తున్నారని, వారికి సిఐటియు, ఎపి రైతు సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.జాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉద్యోగ ఇంటర్వ్యూలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) విభాగం వారు యూనివర్సిటీలోని ఐఐసి వారి ఆధ్వర్యంలో రియల్ వరల్డ్ ప్లేస్‌మెంట్ స్ట్రాటజీస్ ఫర్ సక్సెస్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిట్స్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, పూణే అరిష్టనెట్వర్క్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ క్లౌడ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మోదీన్ రషీద్ అహమ్మద్ పాల్గొని మాట్లాడుతూ జాబ్ ఇంటర్వ్యూలకి ప్రతి ఒక్కరు వారి స్కిల్స్ ను పెపొందించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఇంటర్వ్యూలలో పాల్గొనే ప్రతి విద్యార్థి ముందుగా కంపెనీకి సంబంధించిన సమచారాన్ని అధ్యయనం చేసి, ఇంటర్వ్యూ అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇంటర్వ్యూ షెడ్యూల్‌కు పది నిమిషాల ముందే విద్యార్థి హాజరవాలని, మొదటి ఇంప్రెషన్ బెస్ట్ ఇంప్రెషన్ కావున ఇంటర్వ్యూయర్ భావనలో అది కలిగేలా నడుచుకోవాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో వ్యవహరించాలని, సబ్జెక్టు మీద మంచి పట్టును ప్రదర్శించాలన్నారు. వాస్తవ ప్రపంచ ప్లేస్‌మెంట్ వ్యూహాలు కెరీర్ విజయానికి కీలకమైనవని, విద్యార్థులకు ఆచరణాత్మక అను భవం, నైపుణ్య అభివృద్ధి, విలువైన పరిశ్రమ సంబంధాలు పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ వ్యూహాలలో నియామకాలకు సిద్ధం కావడం, నెట్‌వర్క్‌లను నిర్మించడం, ప్రొఫెషనల్ సెట్టింగ్‌లలో దోహదపడటానికి అవకాశాలను చురుకుగా వెతకడం వంటి చురుకైన దశలు ఉంటా యన్నారు. ఇంటర్వ్యూలో బాడీ లాంగ్వేజ్ కూడా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుందన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ చొక్కనాథన్, కో-ఆర్డినేటర్ ఎస్తర్ మేరిలిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

ప్రజాశక్తి-రాయచోటి

ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని ఎంతో పవిత్రమైనదని డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం డైట్ కళాశాలలో ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా, రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి విచ్చేసిన ఉపాధ్యాయ శిక్షణ పొందే చాత్రోపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈరోజు బోధనా వృత్తి గొప్పతనాన్ని గురించి మాట్లాడడానికి నాకు అవకాశం కలిగించినందుకు చాలా ఆనందంగా ఉందని భారత దేశంలో గురువు స్థానం చాలా గొప్పదన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుని చేతిలో సమాజ నిర్మాణం ఉందని మనం తయారు చేసే విద్యార్థులు రేపటి నాయకులు శాస్త్రవేత్తలు, వైద్యులు, సైనికులు, సేవా మానవతావాదులు కావచ్చని డైట్ లాంటి ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో పనిచేయడం ఎంతో గౌరవప్రదమైన విషయమన్నారు. రేపటి ప్రాథమిక విద్య ఉద్యమానికి ఆధార స్తంభాలు మీరేనని మీలో మంచి విలువలు సానుకూల దృక్పథం విద్య పట్ల శ్రద్ధ బలపరిచే బాధ్యత మనలో ఉంటే మన సమాజాన్ని మార్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ వై.గిరిబాబు యాదవ్, లెక్చరర్లు శివభాస్కర్, రెడ్డప్పరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి కేదార్నాథ్, టి.శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ ఉషారాణి, 100 మందికి పైగా నూతనంగా ప్రవేశించిన ఛాత్రోపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి కృత్రిమ చేయి ఏర్పాటు

ప్రజాశక్తిమదనపల్లె అర్బన్

జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుచున్న ఇంటర్ విద్యార్థిని హెచ్.యు.శివానికి శుక్రవారం కడప రిమ్స్ ఆస్పత్రిలో కృత్రిమ చేయిని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ ఎం.గీత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పుట్టుకతోనే ఒక చేయి లేకుండా పుట్టిన శివాని ప్రస్తుతం నవోద యలో కామర్స్ విభాగంలో 12వ తరగతి చదువుతోందన్నారు. శివానికి తన పనులు తాను చేసుకోవడానికి కష్టమవు తున్నందున కలెక్టర్ చామకూరి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కలెక్టర్ సిఫార్సుతో రిమ్స్ ఉప సంచాలకులు ఆర్.వి.కృష్ణకిషోర్, ఆర్ఎం శ్రీకాంత్ పర్యవేక్షణలో ఆర్థోటిక్స్ డాక్టర్ పి.జగదీశ్ శుక్రవారం శివానికి కృత్రిమ చేయిని అమర్చారన్నారు. తనకు ఇంతటి గొప్ప సహాయం చేసిన వారందరికి శివాని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విభిన్న ప్రతిభావంతురాలైన శివాని విద్యాలయంలో ఇచ్చిన శిక్షణతో 2023 గుజరాత్‌లో, 2024 బెంగుళూరులో జరిగిన పారా జాతీయ క్రీడల్లో జావలిన్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లోను బంగారు పతకాలను సాధించిందని పేర్కొ న్నారు. 2023 థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో జావలిన్ త్రో, షాట్‌పుట్‌లో రెండు బంగారు పతకాలు సాధించిందన్నారు. 2024 థాయ్ లాండ్‌లోనే జరిగిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో షాట్‌పుట్ బంగారు పత కాలు సాధించిందని తెలిపారు. బంగారు పతక విజేత శివానికి కృత్రిమ చేయి అమర్చటం వల్ల మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించగలదనిఆశాభావం వ్యక్తం చేశారు.



అమర్చిన కృత్రిమ చేతితో విద్యార్థిని శివాని

## న్యాయం చేయండి సారూ..!

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాన్న గుండె జబ్బుతో బాధపడుతున్నాడు, అన్న పొలం ఆక్రమించి రానివ్వడం లేదు, మాకు దిక్కెవరు స్వామి.. న్యాయం చేసి ఆదుకోండి సారూ అంటూ బాధితుడు కృష్ణప్ప వేడుకుంటున్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో బాధితులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామసముద్రం మండలం బలిజపల్లెలో తనకు 156/2, 165, 166, 162 సర్వే నెంబర్లలో 2.5 ఎకరాల వ్యవసాయ పొలం ఉందన్నారు. తన భార్య నారాయణమ్మతో కలిసి పదేళ్ల క్రితం కొత్తవారిపల్లిలో ఉన్న అత్తగారింటికి వెళ్లిపోయానని తెలిపారు. అక్కడే ఉంటూ కూలినాలి చేసుకుంటూ జీవిస్తున్నారు. వ్యవసాయ పొలాన్ని తన అన్న గజ్జల వెంకటరమణ, అతని కుమారుడు గజ్జల సీతప్ప సాగు చేసుకునేవారని పేర్కొన్నారు. రెండేళ్లుగా గుండెజబ్బు బారినపడి ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నానని చెప్పారు. తనకు ఆసరాగా ఉన్న తన వ్యవసాయ భూమిని సాగు చేసుకోవడానికి స్వగ్రామానికి వెళితే వెంకటరమణ, సీతప్ప పొలంలోకి రానివ్వకుండా ఈ పొలం తమ అధీనంలో ఉందని, నీకు సంబంధం లేదని దౌర్జన్యానికి తెగబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సీతప్పకు ఉన్న రాజకీయ, అధికార పలుకుబడిని ఉపయోగిస్తూ తీవ్ర అన్యాయానికి ఒడిగడుతున్నాడని వాపోయారు. నా కుమార్తెలు మహేశ్వరి, మంజుల, సావిత్రి తమ భూ రికార్డులను పట్టుకుని అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేదన్నారు. పోలీసుల అండతో సీతప్ప పొలంలోకి రానివ్వకపోవడంతో తమకు దిక్కెవరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టుకు వెళ్లే స్తోమత తమకు లేదని, తమ భూమిని తమకు ఇవ్వాలని కోరారు.




న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితులు


ఆశ్రమంలో భోజనం చేస్తున్న వృద్ధులు

## అన్నదానం గొప్పది

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

పట్టణంలోని 108 పైలెట్ రాజు తన కూతురు నిహారిక జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం వాయల్పాడు పట్టణంలోని శ్రీ చౌడేశ్వరిదేవి వృద్ధా శ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమార్తె జన్మదినాన్ని నిరాడంబరంగా జరుపుకొని అందుకయ్యే ఖర్చుతో వృద్ధాశ్ర మంలో వృద్ధులకు ఒకపూట భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లల్లో చిన్నప్పటి నుండే సేవా దృక్పథాన్ని అల వరచుకునేలా చేయడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. సమాజంలో అభాగ్యులను, నిరాదరణకు గురైన వారిని మానవతా దృక్పథంతో ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. **రాజంపేట అర్బన్ :** శెటెం రామకృష్ణయ్య 31వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని అన్న క్యాంటీన్ వద్ద వారి తనయుడు ఎన్‌జిఒ తాలూకా సంఘం అధ్యక్షులు శెటెం వెంకటరమణ ఆధ్వర్యంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా పేదలకు అన్నదానం చేసేందుకు టోకెన్లు అందించి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తండ్రి శెటెం రామకృష్ణయ్య జ్ఞాపకార్థం తమ వంతు సహాయంగా పేదలకు ఉచితంగా అన్నదానం చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఆయన జ్ఞాపకార్థం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పాల్గొన్నారు.

## రేపు మెగా కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-గుర్రంకొండ**

కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారి కోసం ఆదివారం మెగా కంటి వైద్య చికిత్స శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు రీడో స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ ఐలా ఈశ్వరయ్య ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 గంటల నుంచి ఒంటిగంట వరకు ఈ మెగా వైద్య చికిత్స శిబి రాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సంకల్ప ప్రథమ చికిత్స కేంద్రం, రిడో సేవా సంస్థ, అపోలో మెడికల్ షాప్ ప్రక్కన షంశీర్ ఖాన్ కాంప్లెక్స్ బస్టాండ్‌లో నిర్వహి స్తున్నట్లు తెలిపారు. అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతి వారిచే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరమునకు హాజరైన వ్యక్తులకు కంటి పరీక్షలు నిర్వహించి ఆరేషన్ అవసరమైన వారందరికీ అదే రోజు ఉచిత రావణా సౌకర్యంతో ఆపరేషన్ చేయించి తిరిగి గుర్రంకొండకు చేరుస్తామని చెప్పారు.. అవసరమున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలసిందిగా కోరారు.

**మదనపల్లిలో..**

**మదనపల్లె అర్బన్:** ఆదివారం మదనపల్లెలో చెన్నై శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో స్థానిక బెంగుళూరు రోడ్డు జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉచిత కంటి వైద్య చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిన్ని తెలిపారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. దృష్టి లోపాలు, కంటి శుక్లాలు ఉన్నవారికి పరీక్షలు చేసి ఉచిత మందులు, అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి సంస్థ నుండి ఉచితంగా సర్జరీ చేస్తామని తెలిపారు. ఈ సదావకాశాన్ని దృష్టి సమస్యలు ఎదుర్కొంటున్న వారు వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440078976, సంప్రదించవచ్చని తెలిపారు.

## హజ్ యాత్ర విజయవంతం కావాలి

**ప్రజాశక్తి-రామాపురం**


మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లిములు

హజ్ యాత్రకు బయలుదేరుతున్న ముస్లిం సోదరులు విజయ వతంగా యాత్రను పూర్తి చేసుకొని రావాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం గ్రామానికి చెందిన భాషా తన సతీమణి గులాబ్‌జాన్‌హజ్ యాత్రకు బయలుదేరుతున్న సంద ర్భంలో శుక్రవారం విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ఆయన హాజరై మాట్లా డుతూ ముస్లిం సోదరులు జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్రకు వెళ్లాలనే కోరిక ఉంటుందన్నారు. యాత్రను సంతోషంగా ముగించుకొని తిరిగి రావా లని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అజీమ్, సూరం వెంకట సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం పుంగునూరు మండలంలో జరిగిన ఘటనపై బాధితుని కథనం మేరకు.. పుంగునూరుకు చెందిన నాగరాజా ఆచారి ద్విచక్ర వాహనంలో సొంతపనిపై మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని సుగాలి మిట్ట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి వాహనం బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని స్థానికులు మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలిం చారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పురుషోత్తమ్ తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్త వారోత్సవాల రెండో వార్షికోత్సవ వేడుకలో ఐదవ రోజు రాజంపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమ్మ హెల్పింగ్ హాండ్స్ కువైట్, వికసిత ఫౌండేషన్, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం, జెబివిఎస్ వ్యవస్థాపకులు అశోక్, రెడ్ క్రాస్ మెడికల్ అధికారి డాక్టర్ యశస్విరెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను తెలుసుకొని రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని అన్నారు. రక్తదానం వల్ల మంచి ఆరోగ్య లాభాలు ఉన్నాయని తెలిపారు. జెబివిఎస్ వ్యవస్థాపకులు ఎం.అశోక్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడంపై అవగాహన లేకపోవడంతో రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం ఇబ్బంది పడుతుందని భ్రమ పడుతుంటారని, కానీ రక్తం దానం చేయడం వల్ల పాత కణాలు శరీరం నుంచి పోయి కొత్త కణాలు రావడంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకట నరసయ్య, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ పార్వతి, ఉపాధ్యాయులు, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ప్రశాంతి, ఉషారాణి, స్టీఫెన్, శ్వేత, సాయి పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

# ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు : వైసిపి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని వైసిపి మదనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టివిఆర్ కల్యాణ మండపంలో వైసిపి మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో మండలస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీ కాల్ మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సమావేశంలో రాజంపేట పార్లమెంటర్ నియోజకవర్గ వైసిపి పరిశీల కులు అనూషరెడ్డి, నాయకులు శ్రీనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి, స్థానిక వైసిపి నాయకులతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంకు పైగా గడుస్తున్నా ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయలేక సతమతమవుతున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఆడబిడ్డ నిధి పథకాన్ని ఇంతవరకు అమలు చేయలేకపో తున్నారని అన్నారు. ఈ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని స్వయంగా మంత్రి అచ్చెన్నాయుడు అంటున్నారంటే దాని అర్థం ఏంటో ప్రజలు తెలుసుకోవాలన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు కలసికట్టుగా ఉంటూ ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబుచేసిన సంక్షేమ పథకాల హామీల మోసాన్ని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, రాష్ట్ర వైసిపి పార్టీ యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ హేమంత్ కుమార్, నాయకులు ఆర్ఐ రమణారెడ్డి, రెడ్డి శేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

**బాబు మోసాలు బయట పెడతాం : 'కొరముట్ల'**

**పుల్లంపేట :** గడప గడపకు వెళ్లి సిఎం చంద్రబాబు మోసాలను బయట పెడతామని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.


రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

మండల కేంద్రంలోని ఎస్‌వి కల్యాణమండపంలో ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ రీకాలింగ్ మేనిఫెస్టో పై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, వైసిపి అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు అందిన పథకాలకు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన పథకాలకు ఇచ్చిన హామీలకు గల తేడాను వివరిస్తామని చెప్పారు. మళ్లీ వైఎస్.జగన్‌ను ముఖ్యమంత్రిని చేసే వరకు పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, రైల్వే కోడూరు కన్వీనర్ రామిరెడ్డి ద్వజారెడ్డి, ఓబులవారిపల్లి కన్వీనర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి,మండల కన్వీనర్ సయ్యద్‌ముస్తాక్, ఎంపిటిసి చంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

# సమగ్ర వ్యవసాయ విస్తరణకు కృషి



మాట్లాడుతున్న గంగార్జున

**ప్రజాశక్తి-వీరబల్లి**

సమగ్ర వ్యవసాయ విస్తరణకు కృషి చేస్తున్నట్లు జిల్లా జీవనోపాదుల ప్రాజెక్ట్ మేనేజర్ కోళ్ల గంగార్జున తెలిపారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్యలో ఉత్పత్తి దారుల సమాఖ్య మహాజన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సమీకృత వ్యవసాయంలో తొలి దశలో వీరబల్లి, సోమవరం గ్రామంలో 300 వందల కుటుంబాలను తీసుకొని బేస్ లైన్ సర్వేలో ప్రస్తుత, భవిష్యత్ జీవనోపాదులు సేకరించామని అన్నారు. మునగ వ్యవసాయ పరిశ్రమ వీరబల్లి మండలనికి మంజూరైనట్లు చెప్పారు. మునగ ఆకుతో వంద రకాల ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని అన్నారు. ఈమండలంలో మునగ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర వస్తుందన్నారు.ఎన్‌జిఒ అధికారి అల్లాఅలీ మాట్లాడుతూ బిబి, హెచ్ఐవి వైరస్ లపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు.ప్రకృతి వ్యవసాయ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు ప్రపంచం చూస్తోందని ఆవిధంగా రైతులు పురుగు మందులు లేని వ్యవసాయం చేయాలన్నారు. ఎపిఎం ఖాదర్‌వలి మాట్లాడుతూ మండల రైతు సమాఖ్య 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.70లక్షల లావాదేవీలకు గాను రూ.5.5లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అనంతరం రైతు సమాఖ్య మండల అంధ్యక్షులుగా రాచన్న, కార్యదర్శిగా రామయ్య, కోశాధికారిగా రాంప్రసాద్‌ను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ , ఐఎఫ్‌సి యాంకర్ పర్సన్ అనిత సిసి గంగాధర్, సుధాకర్, నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# పి4తో పేదకుటుంబాలకు బంగారు భవిష్యత్తు

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి**

మండల పరిధిలోని మద్దిరేవుల గ్రామ సచివాలయంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ ఆధ్వర్యంలో ఉదయం పి4 సర్వేపై గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ క్రాంతికుమార్, ఎంపిడిఒ ఉషారాణి మాట్లాడుతూ గ్రామంలో నిరుపేద కుటుంబాలను గుర్తించాలని పేర్కొన్నారు. గ్రామంలో కనిష్టంగా ఉన్న 20శాతం నిరుపేద కుటుంబాల జాబితా దాదాపు 90 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామని వీరిని గ్రామంలో పలుకుబడి, ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలను మార్గదర్శిగా గుర్తించి పలు సహాయ కార్యక్రమాలు కల్పించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వ సహకారంతో ఆర్థిక సహాయం విద్య ,వైద్య సదుపాయాలు కల్పించడం కోసం పి4 విధానం ప్రవేశ పెట్టడం ఆనంద దాయకమని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రజనీష్ రెడ్డి, శ్రీబాబు, వేణుగోపాల్, అడ్వకేట్ వంశీ కృష్ణా సచివాలయ సిబ్బంది, నందిని, జిలాని, హరి ప్రసాద్, మల్లికార్జున పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని రంగంపల్లి సచివాలయంలో మండల అభివృద్ధి అధికారి జయశ్రీ ఆధ్వర్యంలో పి4 సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ అట్టడుగు వర్గంలోని నిరుపేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడమే పి4 కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రమాణాల మేరకు సర్వే చేపట్టాలన్నారు. బంగారు కుటుంబాలను మార్గదర్శితో సమన్వయం చేయాలన్నారు. అట్టడుగు కుటుంబాల వివరాలు తీసుకొని ఉన్నతంగా స్థిరపడిన వారి సహకారంతో వారి ఉన్నతికి చేయూతనివ్వడం జరుగు తుందన్నారు.కార్యక్రమంలో ఇఒపి ఆర్‌డి ముత్తయ్య, విఆర్ఒ ధనమ్మ, పంచాయతీ కార్యదర్శులు శివశంకర్, వెంకటసుబ్బారెడ్డి, యానాదయ్య, రామ సుబ్బారెడ్డి, రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


పుల్లంపేట : మాట్లాడుతున్న ఎంపిడిఒ జయశ్రీ

# స్థలదాతను విస్మరించడం తగదు


స్థలదాత దేశు లక్ష్మయ్యశెట్టి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

పట్టణంలోని స్థానిక నగర పంచాయతీకి స్థలాన్ని విరాళంగా ఇచ్చిన దాతనే అధికా రులు విస్మరించడం తగదని ప్రజలు పేర్కొన్నారు. 1950లో స్థానికుడైన దేశు లక్ష్మయ్యశెట్టి బైపాస్ రోడ్డు పంచాయతీ వీధిలో రోడ్డుపైనే 35 సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారు. ప్రస్తుతం కోట్లు పలికే ఈ భూమిని స్వీకరించిన అప్పటి పంచాయతీ పాలకవర్గం పంచాయతీ భవనాన్ని నిర్మించింది. 1954 మే 5న అప్పటి తంబళ్లపల్లె ఎమ్మెల్యే టిఎన్.వెంకటసు బ్బారెడ్డి భవనాన్ని ప్రారంభించారు.అప్పటి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.ఎ.రవూఫ్, సర్పంచ్ సి.కోదండరా మారావు, భూ విరాళ దాత లక్ష్మయ్యశెట్టి పాల్గొన్నారు. అప్పుడు వేలల్లో విలువచేసే స్థలాన్ని విరాళంగా ఇచ్చిన దాతకు గౌరవిస్తూ దేశు లక్ష్మయ్యశెట్టి ఫొటో పెట్టేందుకు అప్పట్లో తీర్మానం చేశారు. కానీ నగర పంచాయతీగా మారినప్పటి నుంచి స్థల దాత ఫోటో తీసి పక్కన పెట్టడంపై స్థానిక స్థల దాతలు, కుటుంబ సభ్యులు, ప్రజలు మాట్లాడుతూ కోట్లు విలువ చేసే స్థలలో ప్రభుత్వ అధికారులు విధులు నిర్వహిస్తూ ఆయన పొటోను పక్కకు పెట్టడంపై అధికారులు తీరుపై ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు .ఇప్పటికైనా విలువైన భూమిని విరాళంగా ఇచ్చిన దాత ఫోటోను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


నగర పంచాయతీ కార్యాలయం


పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న తహశీల్దార్ పుల్లారెడ్డి

## పిహెచ్‌సిలో తహశీల్దార్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-పుల్లంపేట :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తహశీల్దార్ పుల్లారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే రోగులకు మంచి వైద్యం అందించాలని తెలిపారు. పేదరికంలో ఉన్న వారే ఎక్కువ ప్రభుత్వ ఆస్పత్రికి వస్తారని వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎఎన్ఎంలు ప్రతి ఒక్కరూ గ్రామాల్లో తిరిగి రోగులకు చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజంపేట, కడప రిమ్స్‌కు తరలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఆలయ భూములు ఆక్రమణ కాకుండా చూడాలి

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి :** మండలంలోని జుంజురుపెంట పంచాయతీలో నేరేడు కొండపై ఉన్న ఆలయ మాన్యం భూములు దురాక్రమణ కాకుండా కాపాడాలని నాలుగు గ్రామాల ప్రజలు తహశీల్దార్‌ను కోరారు. నేరేడు కొండ్రాయ ఆలయానికి జుంజురుపెంట, కాల్వపల్లె పంచాయతీల్లో మాన్యం భూములు ఉన్నాయన్నారు. బురుజుపల్లెకు చెందిన కొందరు సొంత భూమిలో వెంకటరమణస్వామి ఆలయాన్ని నిర్మించి నేరేడు కొండ్రాయస్వామి ఆలయం పేరుతో మాన్యం భూములను ఆక్రమించాలని చూస్తున్నారని ఫిర్యాదు చేశారు

## బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించాలి

**- రెండో రోజూ కొనసాగిన రైతుల నిరసన**

**ప్రజాశక్తి-చిట్వేలి :** బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని గురువారం నుంచి చేపట్టిన రైతుల నిరసన రెండవ రోజుకి చేరుకుంది. శుక్రవారం కొందరు దళారులు స్థానిక సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో చర్చించేందుకు ప్రయత్నించారని రైతులు తెలిపారు. తాము ఒప్పుకోకపోవడంతో ఎస్ఐ, సిఐలు రైతులు నిరసన ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా నిరసనచేసుకోవాలని లేకుంటే కేసులు పెట్టేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. బొప్పాయికి గిట్టుబాటు ధర నిర్ణయించే వరకు బొప్పాయిని అమ్మేది లేదని రైతులంతా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దళారులు అందరూ ఏకమై మొన్న మామిడి పంట, ఇప్పుడు బొప్పాయి, రైతులను పిండి పిప్పి చేస్తుంటే దళారి అనే వారు మాత్రం తక్కువ సమయంలో ధనవంతులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు మద్దతు పలకాల్సిన అధికారులు దళారి వ్యవస్థకు అండదండలుగా ఉండడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర ఇచ్చేవరకు నిరసన విరమించేది లేదని స్పష్టం చేశారు కార్యక్రమంలో రైతులు ఎం.విశ్వనాథరెడ్డి, యానాది రాజు, సుబ్రమణ్యం, కోటయ్య, తుంగ శివకృష్ణ, గుండాలరెడ్డి, గిరిబాబురాజు, రవి రాజు, నారాయణ, శివరామి రెడ్డి, బొప్పాయి రైతులు పాల్గొన్నారు.


బొప్పాయి రైతులతో మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లు

## నేటి నుంచి వృద్ధులకు ఇంటివద్దకే రేషన్

**ప్రజాశక్తి-రామాపురం**

ప్రభుత్వ చౌక దుకాణాల పరిధిలోని 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని చౌక దుకాణాల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి వద్దకు వెళ్లి నిత్యవసర సరుకులు అందించాలని సూచిచారు. 1నుంచి 7వ తేదీ వరకు ప్రజలకు అందుబాటులో 1 నుంచి 7వ తేదీ వరకు ఇ-పాస్ మిషన్ ఆన్‌లోనే ఉండాలని తెలిపారు. ముఖ్యమైన పనులపై ఎక్కడికి వెళ్లాలన్నా తహశీల్దార్ అనుమతి తీసుకోవాలన్నారు. డీలర్లు రేషన్ గోడౌన్ వద్దకు వెళ్లి తూకలు సరిచూసుకొని సరుకు తెచ్చిన వెంటనే ఫింగర్ వేసి స్టాక్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తహశీల్దార్ వెంకట రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ కృపావతి, ఆర్ఐ సమద్‌ఖాన్, మండల చౌక దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న దాత

## విద్యా సామగ్రి అందజేత

**ప్రజాశక్తి-పీలేరు**

పీలేరులో పాఠశాల పిల్లలకు ఓ దాత పలురకాల విద్యాసామగ్రి పంపిణీ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పీలేరు నివాసి, సొసైటీ బ్యాంక్ అప్రైజర్ అయిన రాజేంద్ర ఆచారి కుమార్తె సుమలత సొంత ఊరిపై ఉన్న మమకారంతో ఎబిసి సోసైటీ తరపున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, క్రేయాన్ పెన్సిళ్లు, మొదలైనవి పంపిణీ చేశారు. గత పదేళ్లుగా సుమలత చేపట్టిన సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 పద్మావతి, సిఆర్‌సి హెచ్‌ఎం రేణుక, సి.ఆర్.పి శ్వేత, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన

**ప్రజాశక్తి-నందలూరు**

సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎఒ జి. మల్లిఖార్జున తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని నల్లతిమ్మాయపల్లి రైతు సేవా కేంద్రంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఒ మాట్లాడుతూ రైతులు తమకు కావలసిన సమాచారాన్ని వ్యవసాయ శాఖలో సంబందిత పౌర సమాచార అధికారికి దరఖాస్తు చేసి సమాచారాన్ని పొందవచ్చునని అన్నారు. ఈ చట్టం వలన రైతులు తమకు కావాల్సిన సమాచారాన్ని సేకరించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు డ్రోన్ పంపిణీ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

## వ్యవసాయ డ్రోన్లు పంపిణీ

**ప్రజాశక్తి-నందలూరు**

మండలంలోని నల్లతిమ్మాయపల్లె పంచాయితీలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి జి.మల్లిఖార్జున ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో డ్రోన్లను రైతులకు అందజేస్తోందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పరికరాల వాడకం ద్వారా సాగులో ఖర్చులు, సమయం తగ్గించుకోవచ్చని కూలీల కొరతను అధిగమించవచ్చునని తెలిపారు. అనంతరం డ్రోన్లను శ్రీ సౌమ్యనాథ స్వామి రైతు మిత్ర గ్రూప్‌కు యూనియన్ బ్యాంకు మేనేజరు రామా రెడ్డి సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజరు రామా రెడ్డి మాట్లాడుతూ డ్రోన్లకు సబ్సిడీతో పాటు పంట రుణాలు, బంగారు రుణాలు కూడా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వెంకటసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి రైతులు, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పురాతన ఆలయ నిర్మాణం పరిశీలన

**ప్రజాశక్తి-సుండుపల్లి:** మండలంలోని దేవగుడిపల్లి గ్రామం జిల్లావాండ్లపల్లె శ్రీలక్ష్మీన రసింహస్వామి ఆలయాన్ని రూ.1.25కోట్ల పునర్నిర్మిస్తున్నారు. ఈ పురాతన ఆలయ నిర్మాణ పనులను పురావస్తు శాఖ ఎడి రజిత శుక్రవారం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులను పరిశీలించిన పిదప, గుడి నిర్మాణంలో క్వాలిటీ ఏమాత్రం తగ్గకుండా పనులను వేగవంతంగా పూర్తి నాణ్యతతో కూడిన నిర్మాణాన్ని చేయించాలని కాంట్రాక్టర్ సహదేవ రెడ్డికి సూచించారు. కార్యక్ర మంలో పురావస్తుశాఖ సైట్ ఇంజినీర్ శ్రీనివాసులు, పురావస్తు శాఖ టెక్నికల్ అసిస్టెంట్ రాఘవ, రిటైర్డ్ డిటి తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

**ప్రజాశక్తి-రామాపురం**

కిశోర బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ కౌన్సిల్ రవీంద్రబాబు, ఎంఎల్‌హెచ్‌పి ప్రవీణ పేర్కొన్నారు. మండలంలోని కుమ్మరపల్లి జడ్‌పి హైస్కూల్ లో శుక్రవారం కిశోర బాలికల నెలవారి వ్యక్తిగత పరిశుభ్రత అవలోహనం అనే అంశంపై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికలకు ప్రతినెల నది నాప్కిన్లు ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేస్తారని అన్నారు. పాఠశాలలో నాప్కిన్ల వెం డింగ్ మిషన్లు వాడిన నాప్కిన్ల వేయడానికి ఇన్సులేటర్లు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. వాటిని బాలికలు ఉపయోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఆరోగ్య సిబ్బంది, కిశోర బాలికలు పాల్గొన్నారు.


వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న రవీంద్రబాబు, ప్రవీణ